సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 30 । జూలై । 2024



పీజీఆర్ఎస్‌కు ప్రాధాన్యం

ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి ప్రాధాన్యతను ఇవ్వాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



సెల్‌ఫోన్ కోసమే యువతిపై దాడి

సెల్‌ఫోన్ కోసమే యువకుడు ఆయుధంతో యువతిపై దాడి చేసినట్టు విశాఖ నార్త్ జోన్ ఏసీపీ బి.సునీల్ చెప్పారు. 8లో



రుచికరంగా భోజనం

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రుచికరంగా ఉండాలని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ కోరారు. 8లో

న్యూస్‌రీల్

విశాఖలో 76.90 కి.మీ. మెట్రో రైలుకు ప్రతిపాదన

రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబు

సాక్షి, న్యూఢిల్లీ : విశాఖపట్నంలో 76.90 కి.మీ మేర లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం జనవరి, 2024లో చేసిందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాజ్యసభలో తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రాథమిక పరిశీలన అనంతరం, ప్రాజెక్టు మదింపు నిమిత్తం ముందస్తు అవసరమైన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, 2018ను అప్‌డేట్ చేయాలని ఏపీ ప్రభుత్వం కోరిందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు సోమవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో సమాధానమిచ్చారు. ఏపీ ప్రభుత్వం వివరాల ప్రకారం విశాఖపట్నం ఏపీలో సుమారు 23 లక్షలతో అత్యధిక జనాభా కలిగిన నగరమని పేర్కొన్నారు.

ఒలింపిక్స్‌లో మరిన్ని విజయాలు సాధించాలి



సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్ : ఒలింపిక్ క్రీడల్లో దేశం తరపున ఆడుతున్న క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్ ఆకాంక్షించారు. ప్యారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడలపై అవగాహన, క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు చీర్ ఫర్ భారత్ పేరుతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ పతకాన్ని విశ్వ వినువీధిలో ఎగురవేసిన మనూభాకర్ గురించి ప్రస్తావించారు. షూటింగ్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది క్రీడాకారులు విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 33 రోజులకు గాను కోటి 97లక్షల 6వేల 300 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో సోమవారం హుండీల ఆదాయం లెక్కింపు ప్రారంభించారు. తొలి రోజు 14 హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 100.950 గ్రాముల బంగారం, 11.800 గ్రాముల వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. రోజుకు సరాసరి రూ.5,79,597 హుండీ ఆదాయం వచ్చినట్టు తెలిపారు. కాగా మంగళవారం కూడా హుండీ ఆదాయం లెక్కిస్తామని పేర్కొన్నారు. ఈ లెక్కింపులో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

టెట్‌కు ఉచిత శిక్షణ

మహారాణిపేట: జిల్లాలో మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు టెట్ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి ఎం.సత్యపద్మ తెలిపారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సీఈడీఎం), మైనార్టీ సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9052342344ను సంప్రదించాలని కోరారు.

క్లాస్‌మేట్‌కు సీఈ కుర్చీ!



హాట్ కేకలా జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పోస్టు

- ఓ ఎమ్మెల్యే, టీడీపీ కీలక నేత పావులు
- అసెంబ్లీ సాక్షిగా బేరసారాలు
- అరకోటి ఇచ్చేందుకు అంగీకరించిన సీనియర్ ఎస్ఈ
- నలుగురు ఎమ్మెల్యేలతో సిఫార్సు లేఖల అందజేత

అది ఓ ఉన్నతాధికారి కుర్చీ.. దానికున్న క్రేజ్ మాత్రం అంతా ఇంతా కాదు. అందుకే ఆ కుర్చీ హాట్ కేక్ అయ్యింది. ఆ సీటుపై ఆశలు పెంచుకున్న ఓ ఇంజనీరింగ్ అధికారి ఎలాగైనా కూర్చోవాలని తన స్థాయిలో ప్రయత్నాలు మొదలు పెట్టారు. తన క్లాస్‌మేట్ అయిన నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే, టీడీపీలో కీలకంగా ఉన్న నేతతో కలిసి మరో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక జనసేన ఎమ్మెల్యేతో అసెంబ్లీ సాక్షిగా బేరసారాలు సాగించారు. ఆ కుర్చీలో తనను కూర్చోబెడితే రూ. అరకోటి ముట్టజెబుతానని ఇంజనీరింగ్ అధికారి బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీంతో సదరు ప్రజాప్రతినిధులు అసెంబ్లీలోనే సిఫార్సు లెటర్స్ అప్పగించేశారు. ఇంతకీ ఆ కుర్చీపై ఎందుకంత మోజంటే.. అది కోట్ల రూపాయల ప్రాజెక్టుల్ని పర్యవేక్షిస్తూ కాసులు కురిపించే జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ కుర్చీ మరి.!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

మహా విశాఖ నగర పాలక సంస్థలో ఓ కీలక పోస్టు కోసం భారీగానే పైరవీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న చీఫ్ ఇంజనీర్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తుండటంతో కాసులు కురిపించే ఈ కుర్చీపై సీనియర్ ఇంజనీర్ల కన్ను పడింది. ఓ సీనియర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈ స్థానంలోకి వచ్చేందుకు పైరవీలు జరిపిస్తున్నారు. ఈ పోస్టు కోసం రూ.50 లక్షలకు పైగా ముడుపులు చెల్లించేందుకు బేరం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్‌లో నిత్యం కోట్లాది రూపాయల సాధారణ పనులు జరుగుతుంటాయి. దీనికి తోడు స్మార్ట్‌సిటీ.. స్పెషల్ గ్రాంట్. వరల్డ్ బ్యాంక్ నిధులు.. ఇలా చాలా పథకాలతో నగరాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేలా ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందుకే జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేయాలని ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతుంటారు. ఇప్పుడు ఉన్న ఇంజినీర్లలో చాలా మందికి ప్రమోషన్లు వచ్చి బదిలీ అయినా.. ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని ప్రమోషన్లు సైతం వదులుకున్నవారూ ఉన్నారంటే.. ఇక్కడ ఎంత గిరాకీ ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాంటిది చీఫ్ ఇంజనీర్ పోస్ట్ అంటే ఇంకా చెప్పక్కర్లేదు. రిటైరయ్యేలోపు ఒక్కసారైనా ఆ కుర్చీపై కూర్చోవాలన్నది ఎస్ఈల కల. అందుకే ఖాళీ అవుతున్న ఆ సీటుకి వెళ్లేందుకు ఓ ఎస్ఈ పైరవీల పర్వానికి తెరతీశారు. ఇప్పటికే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పెద్దలతో స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడినట్లు తెలుస్తోంది.

రూ. 50 లక్షలకు కుదిరిన బేరం



సీఈ పోస్టు ఖాళీ అవుతోందని తెలుసుకున్న అమరావతి సీఆర్‌డీఏలో పనిచేస్తున్న ఓ ఎస్ఈ జీవీఎంసీ సీఈ సీటు కోసం పావులు కదిపారు. తన క్లాస్‌మేట్.. అధికార పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న నగర పరిధిలోని ఓ ఎమ్మెల్యేను ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కలిశారు. సీఈ సీటుపై తన మోజును వివరించారు. నలుగురు ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్స్ ఉంటే చాలు సీఈ సీట్లో కూర్చోవచ్చనీ చెప్పారు. దీంతో.. సదరు ఎమ్మెల్యే నగరానికి చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేల్ని హుటాహుటిన తన చాంబర్‌కు రప్పించుకున్నారు. ఇందులో ఓ జనసేన ఎమ్మెల్యే కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కీలకంగా వ్యవహరిస్తున్న క్లాస్‌మేట్ ఎమ్మెల్యేకు రూ.20 లక్షలు, మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలకు కలిపి రూ.30 లక్షలకు బేరం మాట్లాడేసుకున్నారు. అంతే నలుగురు ఎమ్మెల్యేలు తమ సిఫార్సు లెటర్స్‌ను సదరు ఎస్ఈకి అసెంబ్లీలోనే అందజేశారు. దీంతో ఆ పోస్టుకు వస్తోంది అమరావతికి చెందిన ఎస్ఈ అంటూ జీవీఎంసీ ఇంజనీరింగ్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. గతంలో ఆయన ఇక్కడ ఎస్ఈగా పనిచేశారు.

అంత డిమాండ్ ఎందుకో..?



కొత్త సీఈ నియామకంపై ప్యానెల్ నిర్వహించాల్సి ఉంటుంది. ఈలోపు ఇన్‌చార్జి సీఈగా నియామక ఉత్తర్వులు జారీ చేసేందుకు బేరాలు కుదుర్చుకున్న ఎమ్మెల్యేలంతా ఈఎన్‌సీపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. అయితే రూ.50 లక్షలతో పైరవీలు చేసేంతగా కుర్చీలో ఏముంటుందో అందరికీ తెలిసిందేనని కార్పొరేషన్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. గతంలో జీవీఎంసీలో చీఫ్ ఇంజనీర్‌గా చేసిన పాము పాండురంగారావు వందల కోట్లు ఆర్జించారనే విషయం ఏసీబీ దాడుల ద్వారా బట్టబయలైంది. అంటే చీఫ్ ఇంజనీర్‌గా ఉంటే కోట్ల రూపాయలు ఆర్జించవచ్చనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే కేవలం ఏడాది కాలం సర్వీసు ఉన్నా ఇచ్చిన మొత్తాన్ని వసూలు చేసేందుకు కావల్సిన దారులన్నీ వెతుక్కోవచ్చనే ఉద్దేశంతో సదరు ఎస్ఈ అమరావతి నుంచి జీవీఎంసీలో పాగా వేసేందుకు వచ్చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే బాటలో మరో ఎస్ఈ కూడా పైరవీలు ప్రారంభించారు. ప్రస్తుతం జీవీఎంసీలోనే ఎస్ఈగా విధులు నిర్వర్తిస్తున్న సదరు ఇంజనీరింగ్ అధికారి సీఈ రేసులో ఉన్నప్పటికీ ముందుగానే బాధ్యతలు చేపట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎవర్ని పట్టుకుంటే ఆ సీటులో కూర్చోవచ్చనే దానిపై ఆలోచనలు చేస్తూ తనకు తెలిసిన మంత్రులు, అధికార ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జూలో తెల్ల పులి దత్తత



పులి దత్తత కోసం జూ అధికారులకు చెక్కు అందజేస్తున్న ఏఎంఎన్ఎస్ లిమిటెడ్ ప్రతినిధులు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు పులులు, వాటి సంరక్షణ, పర్యావరణంలో పులుల ప్రాధాన్యతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్సిలోర్ మెటల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎంఎన్ఎస్) ప్రతినిధులు జూలో బాలు అనే మగ తెల్ల పులిని ఏడాదిపాటు దత్తత తీసుకున్నారు. ఈ మేరకు ఏఎంఎన్ఎస్ వైజాగ్ హెచ్‌ఆర్ హెడ్ అండ్ అడ్మిన్ డి.ఎస్ వర్మ రూ. 1.90 లక్షల చెక్కును జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలో తెల్ల పులిని దత్తత తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీంతో పాటు కేజీహెచ్, విక్టోరియా ఆస్పత్రులు, పాఠశాలలకు సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ఏఎంఎన్ఎస్ లిమిటెడ్ అందించిన సాయంతో తెల్ల పులి బాలుకు ఏడాది పాటు ఆహారం అందించే అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఏఎంఎన్ఎస్ ప్రతినిధులు, జూ అడిషనల్ క్యూరేటర్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, ఎఫ్ఎస్‌వోలు పాల్గొన్నారు.

పశుగణనపై సదస్సు రేపు

విశాఖ సిటీ: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పశుగణనపై ఈ నెల 31వ తేదీ ఉదయం 9.30 గంటలకు గ్రీన్‌పార్క్ హోటల్‌లో సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరుకానున్నారు. అలాగే కేంద్ర ఉన్నతాధికారులతో మూడు రాష్ట్రాల అధికారులు పాల్గొంటారు.

ఆ స్థాయిలో కలెక్షన్!

మహా విశాఖ నగర పాలక సంస్థ పరువును టీడీపీ బంగాళాఖాతంలో కలిపేసింది. జీవీఎంసీ చరిత్రలో తొలిసారిగా స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికల కోసం కార్పొరేటర్ల నుంచి పైసా వసూల్ కార్యక్రమానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు తెరతీశారు. కాసులిచ్చిన కార్పొరేటర్లకే నామినేషన్ పత్రాలందించారు. కాసుల కక్కుర్తి కోసం సొంత పార్టీ కార్పొరేటర్లకు జనసేన ఎమ్మెల్యేలు ఝలక్ ఇచ్చారు. కూటమి కలిసి వస్తోందంటూ బాహాటంగా ప్రకటించిన టీడీపీ.. నామినేషన్ వేసేందుకు సిద్ధమైన బీజేపీ మహిళా కార్పొరేటర్ నుంచి పేపర్లు తీసుకొని పంపించేసి అవమాన పరిచారు. గత మూడు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ ఏమి ఆశించకుండా పదవులు కట్టబెట్టింది. కానీ అధికారంలోకి వచ్చిన వెంటే ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'గణ'ంగా కలెక్షన్లు మొదలు పెట్టేశారు.

- వంతం నెగ్గించుకున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- కాసులిచ్చినవారికే స్టాండింగ్ కమిటీ సభ్యత్వం
- సొంతపార్టీ కార్పొరేటర్లకు ఝలక్ ఇచ్చిన జనసేన ఎమ్మెల్యేలు
- బీజేపీ కార్పొరేటర్ నుంచి నామినేషన్ పత్రాల్ని వెనక్కి తీసుకున్న వైనం
- కూటమిలో కుంపటి రేపిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

సాక్షి, విశాఖపట్నం : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పైసల వసూలు కార్యక్రమానికి తెరతీసిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు అనుకున్న పంతాన్ని నెరవేర్చుకున్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న బేరసారాలు కొలిక్కివచ్చాయి. టీడీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎవరికైతే స్టాండింగ్ కమిటీ సీటు కావాలో వారు కచ్చితంగా రూ.20 లక్షలు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేయడంతో డబ్బులున్నవారంతా అంగీకరించి సీటు సాధించారు. పలువురు టీడీపీ కార్పొరేటర్లు తాము అంత డబ్బు ఇవ్వలేమనీ.. సీటు కావాలని కోరినా కనికరించలేదు. తమ పరిధిలో జరుగుతున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేలు జోక్యంపై వీరు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మాకివ్వాల్సింది ఇవ్వండి.. గేట్లెత్తేసెయ్యండి.! జీవీఎంసీలో జరగాల్సిన పనులకు సంబంధించిన అంశాల్ని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదిస్తారు. గత మూడు పర్యాయాలు అంతా పారదర్శకంగా నిర్వహించారు. ఎవరి వద్ద ఒక్క రూపాయి తీసుకోకుండా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈసారి టీడీపీ ప్రజాప్రతినిధులు మాత్రం అవినీతికి గేట్లెత్తామంటూ చెప్పకనే చెప్పేశారు. మా వాటాలు మాకిచ్చెయ్యండి.. స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగాక.. గెలిస్తే 10 నుంచి 20 శాతం పర్సంటేజీలు కుదుర్చుకోండి. ప్రతి పనిలోనూ వాటాలు తీసుకొని.. ఇష్టం వచ్చినట్లుగా సంపాదించుకోండంటూ ఎమ్మెల్యేలు.. టీడీపీ కార్పొరేటర్లకు హితోపదేశం చేయడం విడ్డూరం. మాకు రూ.20 లక్షలివ్వండి.. ఏడాదిలోగా రూ.40 లక్షలకు పైగా సంపాదించుకోవచ్చు అంటూ బహిరంగంగానే ఆఫర్లు ఇవ్వడం మంచి సంస్కృతి కాదనీ టీడీపీ సీనియర్ కార్పొరేటర్లే ఖండించడం గమనార్హం.



జనసేన, బీజేపీకి ఝలక్.!

జీవీఎంసీ పరిధిలో ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. బీజేపీ ఎమ్మెల్యే ఈ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదు. ఒక జనసేన ఎమ్మెల్యే వేలం వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొని టీడీపీతో చేతులు కలిపేశారు. జనసేన కార్పొరేటర్లు ఉన్నా వారి వైపు కనీసం మాట్లాడకుండా.. డబ్బులిచ్చే టీడీపీ కార్పొరేటర్లకే తన మద్దతంటూ స్పష్టం చేశారు. దీంతో సొంత పార్టీ ఎమ్మెల్యేనే జనసేన కార్పొరేటర్లకు వెన్నుపోటు పొడవడం విశేషం. ఒక ఇండిపెండెంట్ కార్పొరేటర్‌కు మద్దతునిచ్చారే తప్ప.. సొంత పార్టీ వారితో కనీసం చర్చించలేదు. ఇటీవల జనసేన కండువా కప్పుకునేందుకు సిద్ధమైన ఓ మహిళా కార్పొరేటర్ డబ్బులిచ్చి పార్టీలో చేరాలా అంటూ ఎమ్మెల్యేని నిలదీశారు. బీజేపీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ నామినేషన్ వేసేందుకు సిద్ధమై పత్రాల్ని తీసుకెళ్లారు. కూటమి ఎమ్మెల్యేలు ఆమెని పిలిపించి నామినేషన్ పత్రాలు తీసేసుకొని.. మీకెందుకమ్మా స్టాండింగ్ కమిటీ.. వెళ్లండి వెళ్లండంటూ విసుక్కున్నట్లు తెలుస్తోంది. దీంతో సదరు కార్పొరేటర్ అవమాన భారంతో కన్నీటి పర్యంతమవుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారాలు చూస్తే పొరపాటున స్టాండింగ్ కమిటీలో టీడీపీ విజయం సాధిస్తే.. జీవీఎంసీ అవినీతిమయం అయిపోతుందని కూటమి కార్పొరేటర్లే వ్యాఖ్యానిస్తున్నారు. కచ్చితంగా తమ పార్టీ వాళ్లను క్రాస్ ఓటింగ్‌తో ఓడిస్తామంటూ కొందరు చర్చించుకుంటున్నారు.

టీడీపీ కార్పొరేటర్ల వాగ్వాదం

స్టాండింగ్ కమిటీ సీట్ల అమ్మకం వ్యవహారంతో సోమవారం మధ్యాహ్నం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద రచ్చ రచ్చ జరిగింది. డబ్బులిచ్చేవారికే టికెట్స్ ఎలా ఇస్తారంటూ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్‌తో కార్పొరేటర్లు సేనాపతి వసంత, ముక్కా శ్రావణి, బీజేపీకి చెందిన గంకల కవిత వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు కేకలు, అరుపులతో జీవీఎంసీ దద్దరిల్లింది. ఉద్యోగులు, సిబ్బంది ముందు కూటమి కార్పొరేటర్లు కేకలు, అరుపులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్టీకి చెందిన కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్.. వారిని సర్ది చెబుతున్నా వినకపోవడంతో నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజు వద్దకు పంచాయితీ చేరింది. వారు కార్పొరేటర్లకు సర్ది చెప్పారు.

నామినేషన్లకూ ఆహ్వానం లేదు!

మంగళవారంతో నామినేషన్ల స్వీకరణకు గడువు ముగుస్తుండటంతో సోమవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ నుంచి ఐదుగురు, టీడీపీ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థితో కలిపి 10 మంది కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. కూటమి నుంచి అనకాపల్లి, విశాఖ ఉత్తర మినహా మిగిలిన అన్ని చోట్ల నుంచి కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్లు వేసే సమయంలో కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్లెవ్వరికీ కనీసం ఆహ్వానించకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటం

- కూటమి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లు
- తాగిన వ్యక్తికి అస్వస్థత.. తనిఖీలు చేసిన ఎక్సైజ్ అధికారులు
- కాలం చెల్లిన బీర్లు సరఫరా అయినట్లు నిర్ధారణ
- హడావుడిగా రెండు రోజుల క్రితం బాటిళ్లు ధ్వంసం
- అస్వస్థతకు గురైన వ్యక్తి నుంచి ఫిర్యాదు లేదని వివరణ



విశాఖ సిటీ: ఎన్నికల ముందు వరకు నాణ్యతలేని మద్యం విక్రయిస్తున్నారంటూ కూటమి నేతలు గగ్గోలు పెట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రాండెడ్ మద్యం అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటనలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు గడిచింది. ఇప్పటికీ బ్రాండెడ్ మద్యం తీసుకురాకపోగా కాలం చెల్లిన మద్యాన్ని విక్రయిస్తూ మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దీనికి తగ్గట్టుగానే అబ్కారీ అధికారులు సైతం వింత పోకడలు ప్రదర్శిస్తున్నారు. ఒక వైపు మద్యం దుకాణాలకు కాలం చెల్లిన బీర్లు సరఫరా అయినట్లు అంగీకరిస్తూనే.. మరోవైపు తాగిన వ్యక్తి నుంచి ఎటువంటి ఫిర్యాదు తమ దృష్టికి రాలేదని, తాము అతడిని ఆస్పత్రిలో చేర్పించలేదని వివరణ ఇవ్వడం గమనార్హం.

బీరు తాగిన వ్యక్తికి అస్వస్థత

ఇటీవల పెదగంట్యాడ సిద్ధేశ్వరంలోని ప్రభుత్వ వైన్ షాపులో నూకరాజు అనే వ్యక్తి 10000 గోల్డ్ స్ట్రాంగ్ బీర్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి తాగిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నాడు. దీంతో బీరు బాటిల్‌ను పరిశీలించగా కాల పరిమితి ముగిసినట్లు గుర్తించాడు. వెంటనే మద్యం దుకాణానికి వెళ్లి అక్కడ సిబ్బందిని నిలదీశాడు. ఈ విషయం బయటకు రావడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ విషయాన్ని పెద్దది కాకుండా హడావుడిగా తప్పిదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఆ వైన్‌షాప్‌లో కాలం చెల్లిన 10000 గోల్డ్ స్ట్రాంగ్ బీర్లను కాలువలో వేశారు.

డిపో గొడౌన్‌లోనూ కాలం చెల్లిన మద్యం

ఈ నెల 15, 16 తేదీల్లో ఏపీఎస్‌బీసీఎల్ డిపో నుంచి ఎప్పటిలాగే ప్రభుత్వ మద్యం దుకాణాలకు లిక్కర్, బీరు స్టాకులు సరఫరా చేశారు. ఇందులో కాలపరిమితి ముగిసిన ఎస్ఎన్‌జే 10000 బీరు బాటిళ్లు కూడా ఉన్నాయి. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులు వెంటనే మద్యం దుకాణాల్లో ఉన్న బాటిళ్లను పరిశీలించారు. అలాగే డిపోలో స్టాకును పరిశీలించి ఖంగుతిన్నారు. డిపోలోనే కాలం పరిమితి ముగిసిన బాటిళ్లు ఉండడాన్ని గుర్తించారు. అయితే ఎంత మేర అటువంటి స్టాకు ఉందన్న విషయాన్ని గోప్యంగా ఉంచారు. వాటిని అక్కడి నుంచి తరలించే ప్రక్రియ చేపట్టారు.

దర్యాప్తునకు ఆదేశాలు

ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉంటే ఎస్ఎన్‌జీ సంస్థ యాజమాన్యంతో కూటమి నేతలు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ విచారణ పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

వలంటీర్ల నిరసన గళం

- కూటమి నేతలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
- పెండింగ్ జీతాలు చెల్లించాలి
- రూ.10వేల జీతం తక్షణం అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన వలంటీర్లు

మహారాణిపేట: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉండే వలంటీర్లు నిరసన గళం విప్పారు. మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, కూటమి నేతలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేలు జీతం ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు. వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తాం. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 50 రోజులవుతోంది. ఇంతవరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలను తక్షణం చెల్లించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి సంపత్ కోరారు. ఎన్నికల ముందు రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా తెలియజేస్తున్నామని జగదీష్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు.

గత ప్రభుత్వం హయాంలో క్రమం తప్పకుండా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2,60,000 మంది వలంటీర్లకు ఉద్యోగ అవకాశం కల్పించి, నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చేదని జగదీష్, సంపత్ గుర్తు చేశారు. 2020 సంవత్సరంలో కరోనా విలయతాండవం చేసిందని, ఈ సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి పనిచేశారని, కొంత మంది వలంటీర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. అలాగే రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా గత కొన్నేళ్లుగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశామని, పార్టీలకతీతంగా చేపట్టిన కార్యక్రమంలో వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేశారన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న వలంటీర్లు

కూటమి నేతలు హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇవ్వాలి. సంక్షేమ పథకాలు అమలులో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వార్డు, గ్రామ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు నిస్వార్థంగా తీసుకువెళుతున్న తమకు న్యాయం చేయాలి. రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున రెండు నెలల జీతాన్ని అందజేయాలని -లక్ష్మి, వలంటీరు, మధురవాడ జోన్-2

వారిని మళ్లీ చేర్చుకోవాలి



రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకొవాలి. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత వలంటీర్లు చేపడుతున్నారు. నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లు వివిధ కారణాలతో రాజీనామాలు చేశారు. వారందర్నీ మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి. తమకు ఎలాంటి రాజకీయాలు తెలియదు.అలాగే పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

-జగదీష్, వలంటీరు, మధురవాడ, కారుషెడ్డు ఏరియా

పేదలతో మమేకం



కరోనా సమయంలో వలంటీర్లంతా ప్రాణాలకు తెగించి పనిచేశాం. ఈ సమయంలో ఎంతో మంది వలంటీర్లు కరోనాకు బలయ్యారు. అయినా బతుకు తెరువు కోసం ఎంతోమంది వలంటీర్లు ప్రజలకు సేవ చేశారు. నిత్యం పేద ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేశాం. కూటమి నేతలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. రూ.10 వేలు జీతం అందజేయాలి. -సంపత్, జ్ఞానాపురం, జీవీఎంసి జోన్-5

వదినను చంపిన మరిది?

- బంగారం కోసమేనని అనుమానం
- వాంబేగృహ సముదాయంలో ఘటన



బంగారమ్మ (ఫైల్)

గోపాలపట్నం: బంగారు నగలు కోసం వదినను హతమార్చాడు మరిది. అంబేడ్కర్ కాలనీ వాంబే గృహ సముదాయంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం సబ్ డివిజన్ క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాంబే గృహసముదాయంలో బంగారమ్మ నివసిస్తోంది. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు చేసిన ఆమె ఇళ్లల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. దీంతో పాటు ఇంటి వద్దే సమోసాలు చేస్తూ విక్రయిస్తోంది. సమీపంలో తల్లి తరపు కుటుంబ సభ్యులు ఉంటున్నారు. వారి సాయంతో జీవితాన్ని నెట్టుకొస్తోంది. బంగారమ్మ మరిది దుర్గారావు నెల రోజుల క్రితం పెయింటింగ్ పనుల కోసం విజయవాడ నుంచి విశాఖ వచ్చాడు. బంగారమ్మ ఇంట్లో ఉంటూనే పనులకు వెళ్లివస్తున్నాడు. ఆదివారం రాత్రి వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఉదయం చూసేసరికి బంగారమ్మ మృతి చెంది ఉంది. దుర్గారావు పరారయ్యాడు. ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు కూడా కనిపించలేదు. దీంతో బంగారమ్మను చంపి బంగారు వస్తువులతో దుర్గారావు పరారయ్యాడని బంధువులు ఆరోపిస్తున్నారు. బంగారమ్మ మెడకు తాడుతో ఉరి వేసి చంపినట్టుగా గుర్తించారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు దుర్గారావుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

కళాశాలకే కన్నం వేసిన విద్యార్థి

- రూ.5.50 లక్షల చోరీ
- ఆ డబ్బులతో జల్సాలు
- కటకటాలపాలైన వైనం

గోపాలపట్నం: జల్సాలకు అలవాటు పడిన ఆ విద్యార్థి సులభంగా డబ్బు సంపాదించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలు లెక్కించాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు వచ్చి కళాశాలకే కన్నం వేశాడు. రూ.5.50 లక్షలు కాజేడు. ఈ సంఘటనకు సంబంధించి కంచరపాలెం వెస్ట్ సబ్ డివిజన్ సీఐ శ్రీనివాసరావు సోమవారం వివరాలు వెల్లడించారు. ఇంటర్‌లో చేరేందుకు గత నెల 6వ తేదీన సుజాత నగర్‌లోని శ్రామిక నగర్‌కు చెందిన బాలాజీ (19) జ్ఞానాపురం సోఫియా కళాశాలకు వచ్చా డు. ఆ సయమంలో కళాశాల ఫీజు కౌంటర్ వద్ద విద్యార్థులు డబ్బులు చెల్లిస్తున్నారు. ఆ నగదు చూసి బాలాజీకి ఆశ కలిగింది. ఎలాగైనా డబ్బులు చోరీ చేయాలని ప్లాన్ వేశాడు. సాయంత్రం వరకు అక్కడే ఉండి కళాశాల పరిసరాలను పరిశీలించాడు. అదే రోజు రాత్రి ప్రిన్సిపాల్ గది వెనుక భాగాన వెంటిలేటర్ తొలగించి కళాశాలలోకి ప్రవేశించి రూ.5.50 లక్షలు కాజేశాడు. ఆ డబ్బులతో బైకు, స్కూటీ, ఫ్రిడ్జ్, ఐఫోన్ కొనుగోలు చేసి జల్సా చేస్తున్నాడు. కళాశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు అప్పటి నుంచి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎట్టకేలకు నిందితుడ్ని గుర్తించి అరెస్టు చేశారు. బాలాజీ నుంచి రూ.3.50 లక్షల విలువైన వస్తువులు, రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. కేసు ఛేదించిన కానిస్టేబుళ్లు ఎస్.తనేష్‌కుమార్, డీవీవీ కిశోర్‌కుమార్, పి. పైడిరాజులను సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

అంతర్గత కమిటీల ఏర్పాటుకు ఆదేశం



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: జిల్లాలోని మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013కు సంబంధించిన పోస్టర్, హ్యాండ్ బుక్‌ను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రతి చోట అంతర్గత కమిటీలు తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ సీతారామమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, జిల్లా మహిళా శిశు అభివృద్ధి అధికారి డాక్టర్ జి.జయదేవి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కోసమే యువతిపై దాడి

- కొమ్మాది సంఘటనలో వ్యక్తి అరెస్టు
- విశాఖ నార్త్ జోన్ ఏసీపీ సునీల్

మధురవాడ: సంచలనం రేపిన యువతిపై దాడి ఘటనలో ఓ నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. సెల్‌ఫోన్ కోసమే యువతిపై దాడి చేసినట్టు విశాఖ నార్త్ జోన్ ఏసీపీ బి. సునీల్ చెప్పారు. సోమవారం సాయంత్రం పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పీఎంపాలెం, పద్మనాభం సీఐలు వై. రామకృష్ణ, సీహెచ్ శ్రీధర్‌లతో కలిసి మాట్లాడారు. కొమ్మాది జంక్షన్ వద్ద ఉన్న టీఎఫ్‌సీ బేకరిలో చీడికాడ మండలం జైతవరం గ్రామానికి చెందిన ఓ యువతి పనిచేస్తోంది. 22వ తేదీ రాత్రి 10.30 ప్రాంతంలో కొమ్మాది త్రిశక్తి ఆలయం వెనుక ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌కు యువతి వెళ్లింది. అదే సమయంలో మధురవాడ వైభవ్‌నగర్‌కి చెందిన చెవ్వేటి సురేష్ ఆయుధంతో తల, ముఖంపై దాడి చేసి సెల్‌ఫోన్ పట్టుకుపోయాడు. స్పృహ కోల్పోయిన యువతికి రాత్రి 1.30 గంటల సమయంలో మెలకువ వచ్చింది. దీంతో నడుచుకుంటూ తాను ఉంటున్న హాస్టల్‌కు వెళ్లింది. కొద్దిసేపటికే యువతికి వాంతులు కావడంతో తోటి స్నేహితులు వార్డెన్‌కు సమాచారమందించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హాస్టల్‌కు చేరుకున్నారు. బాధిత యువతిని పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు వాడిన సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ పుటేజ్‌ల ద్వారా పోలీసు బృందాలు విచారణ చేసి నిందితుడ్ని గుర్తించారు. ఇదిలావుండగా 24వ తేదీన విశాఖ మెంటల్‌కేర్ ఆస్పత్రిలో సురేష్ వైద్యం నిమిత్తం చేరాడు. సోమవారం నిందితుడు డిశ్చార్జ్ కావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ సునీల్ చెప్పారు. నిందితుడిపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయన్నారు.

ఎక్స్‌సర్వీస్ మన్‌పై దాడి కేసులో ఇద్దరి అరెస్టు

పద్మనాభం పోలీసు స్టేషన్ పరిధిలోని 2023లో ఆదినారాయణ అనే ఎక్స్ సర్వీస్‌మన్‌పై దాడి కేసులో ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ఏసీపీ సునీల్ చెప్పారు. తనపై హత్యాయత్నం జరిగినప్పటికీ నిందితులపై ఐపీసీ 324,341 సెక్షన్ కింద మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారని, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కేసు పునర్విచారణ చేయగా ఆదినారాయణపై హత్యాయత్నం జరిగిందని తేలిందన్నారు. దీంతో నిందితులు కె.రమణ, అతనికి సహకరించిన రాజులపై హత్యాయత్నం కేసుగా మార్చి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్‌లలో, రైళ్లలో సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను సోమవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సాధారణ తనిఖీలలో భాగంగా సోమవారం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో అనుమానంగా సంచరిస్తున్న ఒడిశాకు చెందిన జీతు దాస్, చత్తీస్‌ఘడ్‌కు చెందిన రాకేష్ నేతం, విజయనగరం జిల్లాకు చెందిన తునుపూరు లక్ష్మణ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పోలాకి ఉదయ్‌కిరణ్, కుమ్మరి రాజులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు 1.5లక్షల విలువైన 30 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తెలపారు.



మొబైల్ ఫోన్ దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్న జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

రుచికరంగా మధ్యాహ్న భోజనం

- విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

సింహాచలం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం జరిగిన శిక్షా సప్తాహ్- శుభతిథి భోజనం కార్యక్రమంలో డీఈవో చంద్రకళతో పాటు ఆర్‌జేడీ పాల్గొన్నారు. దాతల సహాయంతో పండ్లు, స్వీట్, పాయసంతో ఏర్పాటు చేసిన డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా వడ్డన చేశారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని అందరూ తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే పథకానికి ఆమె పేరు పెట్టడం జరిగిందన్నారు. ఏపీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ బడి భోజన పథకంలో దాతలు పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పైడిరాజు, విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్, డీఈవో చంద్రకళ

ఎంపీపీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

అడవివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలని సోమవారం విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్, డీఈవో చంద్రకళ తనిఖీ చేశారు.

మెడికవర్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎంవీపీకాలనీ : వెంకోజిపాలెం దరి మెడికవర్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆస్పత్రి సెల్లార్‌లోని మైనస్ 1 ఫ్లోర్‌లో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అక్కడ యూపీఎస్ బ్యాటరీల్లో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో ప్రమాదం జరిగినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ కారణంగా మంటలు ఏర్పడినట్లు వెల్లడించాయి. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపకదళానికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఆ ఫ్లోర్‌లో పొగ పెద్ద ఎత్తున అలుముకుంది. ఈ ప్రమాదం కారణంగా రోగులకు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగలేదని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలి

మహారాణిపేట: వచ్చే నెల ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండో తేదీన పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పట్టణ ప్రాంతం ఎక్కువగా ఉన్నందున యూసీడీ, డీఆర్డీఏ సంయుక్తంగా పింఛన్లు పంపిణీని చేపట్టాలన్నారు. 1,2 తేదీల్లో మొత్తం పింఛన్లు పంపిణీ కావాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లే అవకాశం ఉన్నందున వారికి ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు.

కానిస్టేబుల్‌పై యువకుడి దాడి



గాయపడ్డ కానిస్టేబుల్ రాజు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ రాజు నాయుడుపై కొర్రా వినయ్‌కుమార్ దాడి చేశాడు. వినయ్‌కుమార్‌ది చినవాల్తేర్. భార్యాభర్తల మధ్య గొడవలు కారణంగా అతని భార్య కనకమహాలక్ష్మి ఆదర్శనగర్‌లోని వాళ్ల తల్లి ఇంట్లో ఉంటోంది. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో భర్త వినయ్ తమపై దాడి చేస్తున్నాడని కనకమహాలక్ష్మి 112కు ఫిర్యాదు చేసింది. దీంతో బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ రాజు నాయుడు సంఘటన స్థలానికి చేరుకున్నాడు. అప్పటికీ భార్య, అత్తతో గొడవపడుతున్న వినయ్‌కుమార్‌ను కానిస్టేబుల్ వారించాడు. అయినప్పటికీ వినయ్‌కుమార్ వినకపోవడంతో స్టేషన్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా కానిస్టేబుల్ రాజుపై దాడికి దిగాడు. దీంతో రాజు కంటికి తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న ఎంవీపీ పోలీసులు అక్కడికి చేరుకొని బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ రాజు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దాడికి కారణమైన వినయ్‌కుమార్ పరారయ్యాడు. కానిస్టేబుల్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయనున్నట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు.

కానిస్టేబుల్ అత్యుత్సాహం..



గాయాలతో ప్రభాకర్

కొమ్మాది : జనావాసాల మధ్య డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించడంతో ఓ వ్యక్తి గాయాలపాలైన ఘటన సాగర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఈ ప్రాంతానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకుని సోమవారం రాత్రి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో తన ఇంటికి సమీపంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై ప్రభాకర్ వస్తుండగా కానిస్టేబుల్ వెంకట్రావు వాహనం ఆపి దురుసుగా ప్రవర్తించి ఒక్కసారిగా ప్రభాకర్‌ను లాగేసాడు. దీంతో ప్రభాకర్ అక్కడున్న డివైడర్‌పై పడిపోవడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు దురుసుగా ప్రవర్తించడం వల్లే తాను పడిపోయానని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ప్రధాన కూడళ్ల వద్ద నిర్వహించాలి గానీ జనావాసాల మధ్య నిర్వహించడం ఏమిటంటూ అతను పోలీసులను నిలదీశాడు. దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా జనావాసాల మధ్య, చిన్నచిన్న సందుల్లోను డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయడంపై పలువురు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 250 వినతులను స్వీకరించిన కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీచేశారు. సమస్యతో వచ్చిన వృద్ధుల పట్ల అధికారులు, దిగువ స్థాయి సిబ్బంది అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై అటువంటివి పునరావృతం కాకూడదని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు జాయింట్ సీపీ ఫకీరప్ప, ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న మూడో లైన్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ కింది రైళ్లు ఆయా తేదీల్లో విజయవాడ మీదుగా కాకుండా రాయనపాడు, గుడివాడ, నిడదవోలు (విజయవాడ మీదుగా కాకుండా) మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గంలో ఈ రైళ్లకు రామవరప్పాడులో తాత్కాలిక హాల్ట్ ఏర్పాటు చేశారు. ◆ విశాఖపట్నం-హైదరాబాద్-విశాఖపట్నం(12727/12728) గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు.. ◆ ముంబయి-భువనేశ్వర్- ముంబయి (11019/ 11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు.. ◆ టాటానగర్‌లో ఆగస్టు 8వ తేదీన బయల్దేరాల్సిన టాటానగర్-యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్ ◆ యశ్వంత్‌పూర్‌లో ఆగస్టు 4వ తేదీన బయల్దేరాల్సిన యశ్వంత్‌పూర్-టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ ◆ విశాఖపట్నం-న్యూఢిల్లీ-విశాఖపట్నం(20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు..

రామవరప్పాడు-రాయనపాడు మీదుగా..

◆ విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖపట్నం (18519/18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు రామవరప్పాడు-రాయనపాడు మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

రామవరప్పాడు-రాయనపాడు-గుణదల మీదుగా...

◆ విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం (12739/12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు.. ◆ ఆగస్టు 8వ తేదీన బయల్దేరాల్సిన విశాఖపట్నం-గాంధీదాం (20803) ఎక్స్‌ప్రెస్. ◆ ఆగస్టు 4వ తేదీన బయల్దేరాల్సిన గాంధీదాం-విశాఖపట్నం (20804) ఎక్స్‌ప్రెస్ ◆ ఆగస్టు 5వ తేదీన బయల్దేరాల్సిన పూరి-ఓఖా(20819) ఎక్స్‌ప్రెస్ ◆ ఆగస్టు 7వ తేదీన బయల్దేరాల్సిన ఓఖా-పూరి(20820) ఎక్స్‌ప్రెస్ ◆ ఆగస్టు 4,7వ తేదీల్లో బయల్దేరాల్సిన నిజాముద్దీన్-విశాఖపట్నం (12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ ◆ ఆగస్టు 5, 9వ తేదీల్లో బయల్దేరాల్సిన విశాఖపట్నం-నిజాముద్దీన్ (12803) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ◆ షాలిమర్-హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు.. ◆ హైదరాబాద్-షాలిమర్(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు..

◆ ఆగస్టు 8వ తేదీన బయల్దేరాల్సిన విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్‌లు

ఇక ప్రతి రోజూ అర్జీల స్వీకరణ

- సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు..
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 116 వినతులు

డాబాగార్డెన్స్ : ఇకపై ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రజల అర్జీలు సమర్పించుకోవచ్చని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ అన్నారు. ఆ సమయంలో తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మేయర్ హరివెంకట కుమారితో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన దివ్యాంగులకు వద్దకు నేరుగా కమిషనర్ వెళ్లి వినతిపత్రాలు స్వీకరించారు. కుటుంబ పోషణకు పని కల్పించాలని కొంచాడ శ్రీకాంత్ విజ్ఞప్తి చేయగా..కుటుంబంతో నివసించేందుకు గృహాన్ని మంజూరు చేయాలని దివ్యాంగుడు నిమ్మల అప్పలరాజు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 116 అర్జీలను అధికారులు స్వీకరించారు. వీటిలో జోన్-2కు 16, జోన్-3కు 25, జోన్-4కు19, జోన్-5కు 12, జోన్-6కు6, జోన్-8కి 11 ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 27 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) శ్రీనివాసరావు, డీడీహెచ్ దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్